క్లుప్తంగా

నిర్భయంగా ఓటు వినియోగించుకోండి



కాకినాడలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కాకినాడ క్రైం: ఎన్నికల వేళ ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పోలీస్, పారామిలటరీ దళాలు భరోసా ఇస్తున్నాయి. నగరంలో టూ టౌన్ పోలీసులతో కలిసి పశ్చిమ బెంగాల్‌కు చెందిన 100 మందితో కూడిన భారీ పారా మిలటరీ దళం ఆయుధాలతో గురువారం కవాతు నిర్వహించింది. టూ టౌన్ సీఐ నాగేశ్వర్‌నాయక్ సారథ్యంలో ఈ కవాతు నిర్వహించారు. సీఐ నాయక్ మాట్లాడుతూ ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ హనుమంతరావు పర్యవేక్షణలో భారీ కవాతు నిర్వహించామన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

కరప: గ్రామాల్లో అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. మండలం పెదకొత్తూరులో గురువారం ఆయన పర్యటించి పనులను పరిశీలించారు. ఎస్సీ వీధిలో రూ 12.5 లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలు నిర్మాణపనుల ప్రగతిని పరిశీలించారు. తర్వాత రూ.2.5 లక్షలతో నిర్మిస్తున్న ఆర్వో ప్లాంట్ భవన నిర్మాణాన్ని పరిశీలించి, పనులు వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. వీవీఎస్ వీరేష్, కె.వీరేశ్వరరావు పాల్గొన్నారు.

శిక్షణ ఏర్పాట్ల పరిశీలన

కాకినాడ: ఎన్నికలకు సంబంధించి ఈవీఎం, వీవీ ప్యాట్ల పనితీరుపై శనివారం జరగనున్న శిక్షణ ఏర్పాట్లను నియోజకవర్గ ఈఆర్‌ఓ, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు గురువారం పర్యవేక్షించారు. స్థానిక పీఆర్ కళాశాల ఆవరణలో సుమారు 550 మంది ఎన్నికల సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇవ్వనున్నారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, తహసీల్దార్ దొర, డిప్యూటీ తాసిల్దార్ నాయుడు తదితరులు ఉన్నారు.

పంచాక్షరి ప్రతిధ్వనించే వేళ

- శివరాత్రికి శైవాలయాల ముస్తాబు
- తెల్లవారుజాము నుంచే దర్శనాలకు ఏర్పాట్లు

బోట్‌క్లబ్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కాకినాడ నగరంలో శివాలయాలను గురువారం సాయంత్రానికే శోభాయమానంగా అలంకరించారు. శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో భారీస్థాయిలో ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నగరంలో పలు ప్రసిద్ధ శైవక్షేత్రాల్లో క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. తెల్లవారు జాము నుంచే స్వామికి అభిషేకాలు నిర్వహించేలా ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. నగరంలోని స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఆలయంలో పువ్వులు, మామిడితోరణాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. లింగోద్భవ సమయంలో హారతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక రామారావుపేటలో అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో, సూర్యారావుపేటలోని బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్వామి వారికి విశేష పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో జ్యోతిర్లింగ దర్శనం, మహాశివునికి విశేష అభిషేకములు, అర్చనలు జరుగుతాయని ఆలయ ఇన్‌చార్జి గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక రామారావుపేటలోని సౌమ్య ఎన్‌క్లేవ్‌లో ఉన్న మరకతమణికంఠ పీఠంలో పార్థివ లింగార్చన జరుగుతుందని పీఠం వ్యవస్థాపకులు నందమూరి వినోద్ తెలిపారు. వీటితోపాటు జగన్నాథపురంలో సర్వేశ్వరస్వామి ఆలయం, సాంబమూర్తినగరంలో శివాలయంతో పాటు పలు శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



విద్యుత్ వెలుగుల్లో రామారావుపేటలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానం

సూక్ష్మ విభూది శివలింగం





అరిపాక రమేష్‌బాబు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): మహాశివరాత్రి సందర్భంగా సూక్ష్మ కళాఖండాలు తయారుచేసే స్థానిక అరిపాక రమేష్ బాబు విభూదితో అతి చిన్న శివలింగాన్ని తయారు చేశారు. రెండున్నర అంగుళాల ఎత్తులో త్రిశూలం, సెంటిమీటరు పరిమాణంలో ఢమరుకం తయారు చేశారు. ఈ శివలింగము ఎత్తు 2.25 అంగుళాలు, వెడల్పు 1.25 అంగుళాలు, బరువు 32 గ్రాములు అని రమేష్ తెలిపారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో సత్ఫలితాలు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ఆధునిక హంగులతో తిమ్మాపురం పోలీసు స్టేషన్ ప్రారంభించిన ఎంపీ గీత
- నిష్పక్షపాతంగా సేవలు అందించాలన్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



పోలీసు స్టేషన్ భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ గీత, ఎమ్మెల్యే కన్నబాబు, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ రూరల్: ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో సత్ఫలితాలు వస్తున్నాయని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. తిమ్మాపురం పోలీసు స్టేషన్‌ను ఆధునిక హంగులతో అందుబాటులోకి తీసుకువచ్చామని ఆయన ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. గ్రామంలో ఎస్ఆర్ఎంటీ సీఎస్సార్ నిధులు రూ.60 లక్షలతో నిర్మించిన ఈ భవనాన్ని గురువారం ప్రారంభించారు. సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ సతీష్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ ఇక్కడి స్టేషన్ భవనం శిథిలావస్థలో ఉండడంతో కొత్త భవనం కోసం విలువైన స్థలం కేటాయించామని, సీఎస్సార్ నిధుల కోసం ఎంపీ గీత సహకరించారన్నారు. ఈ పరిధిలో ఆయిల్ రిఫైనరీలు, పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని, భవిష్యత్తులో చాలా పరిశ్రమలు రాబోతున్నందున స్టేషన్ కీలకంగా మారబోతోందన్నారు. ఇంద్రపాలెం, కరప పోలీసు స్టేషన్లకు నూతన భవనాలు నిర్మించాల్సి ఉందన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. ఎంపీ గీత మాట్లాడుతూ కాకినాడ – పిఠాపురం రోడ్డును ఆనుకుని ఉంటే పోలీసు స్టేషన్ భవనం పాతగా ఉండడంతో పాటు ఎదురుగా స్పీడ్ బ్రేకర్లు ఉండేవన్నారు. గ్రామ పంచాయతీ విలువైన స్థలం కేటాయించడంతో నేడు ఆధునిక భవనం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ పోలీసు స్టేషన్లకు సీఎస్సార్ నిధులతో నూతన భవనాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలు అందించాలని కోరారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ తిమ్మాపురం, పిఠాపురం టౌన్, కిర్లంపూడి పోలీసు స్టేషన్ల భవనాల నిర్మాణానికి ఎంపీ గీత సహాయ సహకారాలు అందించారన్నారు. జెడ్పీటీసీలు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, గోపుశెట్టి బాబ్జీ, అదనపు ఎస్పీ (పరిపాలన) భాస్కరరావు, అదనపు ఎస్పీ (రిజర్వు) బి.సత్యనారాయణ, ఎస్ఈబీ అదనపు ఎస్పీ శ్రీలక్ష్మి, డీఎస్పీ హనుమంతరావు, సీఐ శ్రీనివాస్, ఎస్సై రవీంద్రబాబు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో అంబేడ్కర్ భవనం

అంబేడ్కర్ సమానత్వాన్ని కోరుకున్న వాడని, దేశంలో అందరూ బాగుండాలని ఆయన ఆకాంక్షించారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో తిమ్మాపురంలో రూ.కోటితో అంబేడ్కర్ భవనం చేపట్టామని కురసాల తెలిపారు. సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ స్థలం ఖరీదు రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఉంటుందని, రూ.కోటి వ్యయంతో బిల్డింగ్ నిర్మించామన్నారు. తిమ్మాపురంలో అంబేడ్కర్ భవనంతో పాటు కరప, వాకలపూడిలో అంబేడ్కర్ భవనాలు నిర్మిస్తున్నామన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో సీఎం జగన్ ముందుకు సాగుతున్నారని, అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలియజేసేలా తిమ్మాపురం భవనంలో వివరాలు ఉంచుతామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, శెట్టిబత్తుల కుమార్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, వైస్ ఎంపీపీ బందిలి విరీష, గోపుశెట్టి బాబ్జీ, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దన్‌రావు, అనుసూరి ప్రభాకర్, కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, చింతా ఈశ్వరరావు, కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, విలియమ్స్, స్టీఫెన్ ఆనంద్, దడాల జాషువా గిరి, వర్ధినీడి సుజాత, బెన్నీ, ఇమాన్యుయేల్, జమ్మలమడక నాగమణి, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, చెల్లి దేవరాజు, ఏఈ వాసుదేవరావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపురంలో రూ.కోటితో నిర్మించిన అంబేడ్కర్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

తిమ్మాపురం గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.20 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే కన్నబాబు ప్రారంభించారు. అచ్చంపేట తినగర్‌లో కుమ్మర శాలి వాహన సంక్షేమ భవనం శంకుస్థాపన, మారుతీనగర్, రేపాక గార్డెన్‌లో రెండు వాటర్ ట్యాంకులు రూ.1.7 కోట్లతో నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: మండలంలోని సూర్యారావుపేట గ్రామానికి చెందిన మత్స్యకారులు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద మత్స్యకార నాయకుడు సూరాడ రాజు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేనకు చెందిన బొబ్బిలి శామ్యూల్, చోడిపిల్లి వరాలు, గరికిన దుర్గా ప్రసాద్, అర్జిలి శ్రీను, తదితరులు సుమారు 35మంది చేరడంతో వారికి పార్టీ కండువాలు వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే కన్నబాబు సాదరంగా ఆహ్వానించారు.

మీ సైనికుడిలా.. సేవకుడిలా పనిచేస్తా

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- ఇళ్ల స్థల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

కాకినాడ: ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ఓ సేవకుడిలా, సైనికునిలా పనిచేస్తానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో మరోసారి గెలుపొందిన అనంతరం 2025 డిసెంబర్ చివరినాటికి 30 వేల ఇళ్లను పూర్తి చేసి ప్రతి ఒక్కరు స్వగృహప్రవేశం చేయాలన్నదే తన ఆకాంక్ష అని స్పష్టం చేశారు. ఇందుకోసం తాను పూర్తి సమయాన్ని వెచ్చిస్తానన్నారు. స్థానిక సూర్యనారాయణపురం, ఆనందభారతి గ్రౌండ్స్‌లో సుమారు 9 డివిజన్లకు చెందిన ఇళ్ల స్థల లబ్ధిదారులకు గురువారం రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కమిషనర్ జె.వెంకటరావు, ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వంటి నేతలు చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. వారిని నమ్మి ఓటు వేస్తే ప్రారంభించిన ఇళ్లు నిలిచిపోతాయని, అన్ని సంక్షేమ పథకాలను దక్కకుండా అడ్డుపడతారన్నారు. రూ.35వేలు ఖర్చయ్యే రిజిస్ట్రేషన్‌కు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా ఉచితంగా ఇస్తున్నారన్నారు. భవిష్యత్‌లో సదరు ఇంటిస్థలంపై సంపూర్ణహక్కు లభిస్తుందని, అవసరమైతే తనఖా పెట్టుకోవడం, కుటుంబ సభ్యులకు బదలాయించుకోవడం వంటివి చేసుకోవచ్చునన్నారు. నిరంతరం ప్రజల కోసం పనిచేసే ముఖ్యమంత్రిని, తనను ఆశీర్వదించాలని కోరారు. నగరపాలక సంస్థ అధికారి ఎం.ఏసుబాబు మాట్లాడుతూ ఆయా డివిజన్లకు సంబంధించి సుమారు 5,800 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్నామన్నారు. సంబంధిత సచివాలయాల్లో లబ్ధిదారులు డాక్యుమెంట్లను తీసుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, ఆయా డివిజన్లకు చెందిన మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

అక్కచెల్లెమ్మలకు విలువైన ఆస్తి

- సీఎం జగన్‌పై మరోసారి అభిమానం చూపండి
- పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: అక్క చెల్లెమ్మలకు విలువైన ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు జీవితాంతం గుర్తుండిపోయేలా సంపూర్ణ హక్కుతో సీఎం జగన్ రిజిస్ట్రేషన్ పట్టాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. ఆయనపై మరోసారి మీ అభిమానం చూపాలని మహిళలను ఎమ్మెల్యే కోరారు. మండలంలోని తిమ్మాపురంలో ప్రజ్ఞ ఫంక్షన్ హాలులో గురువారం పట్టాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సుమారు 32 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి కొత్తగా ఊళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. కోట్లాది రూపాయలతో విలువైన భూములను సేకరించిన లే అవుట్లు ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు గృహ రుణాలు ఇవ్వడంతో సొంతింటి కలను సాకారం చేసుకున్నారు. పేదల రాత మారేలా సంక్షేమ పథకాలను వారి ఖాతాలలోకి నేరుగా వేసి సీఎం జగన్‌కు, తనకు ప్రజల ఆశీర్వాదం ఎప్పుడూ ఉండాలన్నారు. సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ మాట్లాడుతూ ఇంతటి అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కన్నబాబుకు రుణపడి ఉంటానని, ఆయన వెంటే నడుస్తానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, వైస్ ఎంపీపీ బందిలి విరీష, ఎంపీటీసీ ముద్దన వెంకట్రావు, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తదితరులు

మహిళా గౌరవంతోనే సంపూర్ణ సాధికారత

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్త్రీలను గౌరవించినప్పుడే సంపూర్ణ మహిళా సాధికారిత సాధ్యమని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. వర్సిటీలో విమెన్ ఎంపవర్‌మెంట్ గ్రీవెన్స్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ మహిళలు లక్ష్యం ఏర్పరచుకుని దాని సాధనకు శ్రమించాలన్నారు. రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, టీచింగ్, నాన్‌టీచింగ్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌లో..

కాకినాడ లీగల్: సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి పేర్కొన్నారు. కాకినాడ బార్ అసోసియేషన్‌లో గురువారం అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జడ్జి కమలాదేవి మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలకు అండగా ఉండాలన్నారు.

కరప జెడ్పీ ఉన్నత పాఠశాలలో

కరప: మండలం గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నతపాఠశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం ఎ.సాయిమోహన్ ఉపాధ్యాయినులు పి.మాణిక్యాంబ, ఎం.ప్రభారాణి, పి.భవాని, సీహెచ్ పద్మావతి, కె.లక్ష్మి, డి.వరలక్ష్మిలను సత్కరించి, మెమెంటోలను అందజేశారు. స్టాఫ్‌సెక్రటరీ ఐ.ప్రసాదరావు పాల్గొన్నారు.

మహిళోద్ధరణలో పురుషునికీ ప్రాధాన్యం

కాకినాడ సిటీ: నూట యాభై ఏళ్ల క్రితం కారా జాక్టిన్ చేసిన ఆలోచనలు, ఆమె చేసిన పోరాటాలు మహిళోద్ధరణకు ఎంతగానో ఉపయోగపడ్డాయని మహిళా సంఘాల అధినేత్రి బలగం లత అన్నారు. పురుషుని విజయం వెనుక మహిళ ఉన్నట్టే, మహిళల విజయం వెనుక పురుషుని ప్రాధాన్యం ఉందని మరువరాదన్నారు. తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీలో గురువారం జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త సీహెచ్ విజయ అధ్యక్షత వహించగా మహిళా నాయకురాలు ఎం.వీరలక్ష్మి, తూరంగి పీహెచ్‌సీ వైద్యాధికారి వసుంధరాదేవి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి

బోట్‌క్లబ్: నగరంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా గాంధీనగర్ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో గురువారం మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి ఆధ్వర్యంలో 41 డివిజన్ మహిళా పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. ఇనుకొండ పట్టాభి రామయ్య, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గోడి వెంకట్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి కమలాదేవి

సంక్షిప్తంగా..

కొనసాగిన దీక్షలు

కాకినాడ: ఓఎన్‌జీసీ నష్టపరిహారం అందజేయాలని కోరుతూ మత్స్యకారులు చేపట్టిన నిరసన దీక్షలు గురువారం కూడా కొనసాగాయి. పోర్టు ఆవరణలోని జట్టీల వద్ద చేపట్టిన దీక్షా శిబిరంలో కొత్తకాకినాడ ప్రాంతానికి చెందిన మత్స్యకారులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. మత్స్యకారుల న్యాయ సమ్మతిమైన డిమాండ్లను ఆమోదించేవరకు జరిగే ఆందోళనకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సూచనలకు అనుగుణంగా రానున్న రోజుల్లో రాజకీయాలకు అతీతంగా మత్స్యకారులు అందరినీ సమన్వయం చేసుకుని నిరసనలు కొనసాగిస్తామన్నారు.

కాకినాడ సిటీ నుంచి పోటీకి సిద్ధమే

బోట్‌క్లబ్: బీజేపీ నుంచి కాకినాడ సిటీ నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు బీజేపీ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక భానుగుడి సెంటర్లో ఆయన నివాసంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పొత్తులో భాగంగా తనకు పార్టీ టిక్కెట్టు వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 20 ఏళ్లుగా రాజకీయ అనుభవం ఉందన్నారు. తనకు అవకాశం వస్తే కాకినాడ నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

ఓటు హక్కుతో సమాజాభివృద్ధి

బాలాజీచెరువు: సమాజాభివృద్ధి మనం వేసే ఓటుపై ఆధారపడి ఉంటుందని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదుచేసుకుని సద్వినియోగం చేసుకోవాలని ఏపీటీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. కళాశాలలో గురువారం నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో ఓటు హక్కు-దాని ప్రాధాన్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. సాయంత్రం మహిళ సాధికారితపై నారీ-శక్తి పేరుతో కార్యక్రమం నిర్వహించి మహిళల ప్రాధాన్యత వివరించారు. పీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు హరిరామ్‌ప్రసాద్, కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

మరో రెండు శాంపిల్ కలెక్షన్ కౌంటర్లు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శాంపిల్ కలెక్షన్ కౌంటర్ల సేవలకు విశేష స్పందన లభిస్తోంది. రోగి ఆసుపత్రిలో ఎక్కడో ఉన్నా ల్యాబ్ కౌంటర్ల వద్దకు వెళ్లి తన రక్త నమూనాలు ఇవ్వాల్సిన ప్రయాస వీటి ఏర్పాటుతో సమసిపోయింది. దీంతో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్ రద్దీని నియంత్రించి రోగులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు మరో రెండు అదనపు శాంపిల్ కలెక్షన్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు అధికారులతో కలిసి కౌంటర్లను సందర్శించి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

ఓటు అవగాహన సదస్సు

కాకినాడ రూరల్: స్థానిక నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2చే ఓటరు అవగాహన సదస్సును నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఎం.శ్రీదేవి, డాక్టర్ కె.హరిబాబు ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ తమ్మవరం, పెనుమర్తి గ్రామాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తమ్మవరం గ్రామం ప్రెసిడెంట్ గొల్లపల్లి రాంబాబు, పెరుమర్తి గ్రామం ప్రెసిడెంట్ పెంకె ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

రిజిస్ట్రేషన్లు చేయించుకోండి

కాకినాడ రూరల్: నవరత్నాలు పేదలందరికి ఇళ్ల పథకంలో లబ్ధిదారులకు అన్ని సచివాలయాలలో రిజిస్ట్రేషన్లు చేసి దస్తావేజులు అందజేస్తున్నామని తహశీల్దార్ ప్రసాద్ తెలియజేశారు. ఎవరైనా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు తక్షణమే తమ పట్టా స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని గురువారం కోరారు.

మేలో ఏఐసీసీ క్రికెట్ టోర్నీ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): యువతను సన్మార్గంలో నడిపేందుకు ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) ఆధ్వర్యంలో మే నెలలో క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్టు కౌన్సిల్ కాకినాడ అధ్యక్షుడు రిక్కిగూటం గురువారం తెలిపారు. స్థానిక రామారావు పేటలోని సత్యవాణి చర్చిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ బెన్ని ఆధ్వర్యంలో ఈ టోర్నీ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర ఏఐసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోసఫ్‌బెన్ని, చర్చ్ ఆఫ్ గాడ్ ఇండియన్ ఓవర్సీస్ బిషప్ రెడ్డి జ్యోతికుమార్, ప్రముఖ సువార్త వర్తమానికులు సువార్తరాజు తదితరులు క్రికెట్ టోర్నీ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఒకవ్యక్తి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపిన కథనం మేరకు కరప గ్రామానికి చెందిన పేపకాయల భద్రం (50) వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. మూడు రోజుల క్రితం టీ తాగి వస్తానని చెప్పి, ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చేసాడు. మతిస్థిమితం సరిగాలేక ఈ నెల 6వ తేదీన ఉదయం పొలంలోకి వెళ్లి పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతనిని కాకినాడ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతని కుమారుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెలాఖరు లోపు జీజీహెచ్‌లో లిఫ్టు పనిచేయాలి

కాకినాడ క్రైం: జీజీహెచ్ మెడికల్ వార్డులో లిఫ్ట్ మరమ్మత్తులపై సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కోన్ ఎలివేటర్స్ సంస్థకు యాజమాన్యానికి గురువారం లేఖ రాసి నిర్ణీత సమయం లోపు కొత్త లిఫ్టు అమర్చకపోతే ఆసుపత్రిలో సంస్థ కార్యకలాపాలను నిలిపివేసి డీఎంఈ, కలెక్టర్ ఆదేశాలతో సంస్థను బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. ఈ మేరకు ఆ యాజమాన్యం స్పందిస్తూ ఈ నెలాఖరులోపు కొత్త లిఫ్టును వినియోగంలోకి తీసుకువస్తామని లిఖితపూర్వకంగా గురువారం సూపరింటెండెంట్‌కు వివరించారు.